క్లుప్తంగా

అభిమాన గొడుగుల అందజేత



గొడుగులను అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఫొటోలతో కూడిన గొడుగులను వైఎస్సార్‌సీపీ నాయకులకు డిప్యూటీ సీఎం రాజన్నదొర సోమవారం అందించారు. జగన్‌మోహన్‌రెడ్డి, రాజన్నదొరల మీద అభిమానంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవలస రామారావు తన సొంత డబ్బుతో సుమారు 500 గొడుగులు చేయించి రాజన్నదొర చేతుల మీదుగా పంచిపెట్టారు. ఉపముఖ్యమంత్రి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గ్రామాలభివృద్ధి

సీతానగరం: మండలంలోని ప్రజలు ఐకమత్యంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. సోమవారం పెదభోగిలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జె.తేరేజమ్మ అధ్యక్షతన ఈఓ వెంకటరావు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సున్నితంగా పరిష్కరించుకోవాలని అభిప్రాయ పడ్డారు. సర్పంచ్ తేరేజమ్మ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పంచాయతీ అభివృద్ధికి అందరం కృషి చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరవింద్‌కుమార్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

టిడ్కో వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ



టిడ్కో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురం: ఏపీ టిడ్కో వార్షిక క్యాలెండర్‌ను ఆ సంస్థ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. గత ఏడాదిగా టిడ్కోలో జరిగిన అభివృద్ధి, నిర్మాణాల సముదాయాలను, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు తదితర అంశాలను తెలియజేసేలా వినూత్నంగా టిడ్కో వార్షిక క్యాలెండర్-2023ను రూపొందించి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కేవలం ఒక్క రూపాయికే ఇల్లు ఇచ్చే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. పేదల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. ఇంతవరకు రాష్ట్రంలో దాదాపు 45 వేల గృహాలను లబ్ధిదారులకు అందించగా, మరో మూడు నెలల్లో మరో 50వేల గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. లక్ష్మంనాయుడు, ఎం.ఫకీరునాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డుపై పడిఉన్న వాహనాలు

సీతంపేట: మండలంలోని కారెం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. దుగ్గిలో గ్రామ సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆరిక సంతోషి తమ స్వగ్రామం కోడిశ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. అదే సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై రాజు, దేవి వస్తున్నారు. కారెం సమీపంలో రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. ఎస్సై ఎ.నీలకంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీపీ బి.ఆదినారాయణ తదితరులు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు.


ద్విచక్రవాహనం చోరీ

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్‌లో ఉన్న తన ద్విచక్ర వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైనట్లు పాదిలాపు శివాజీరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై బి.శివప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పార్వతీపురం జిల్లా పీఆర్.నాయుడుపేటకు చెందిన మరిపి గోవింద వాహనాన్ని దొంగిలించినట్లు గుర్తించారు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, అతని నుంచి అపహరణకు గురైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిట లాడాయి. ముక్కోటి ఏకాదశి నాడు స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శిస్తే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని అర్చకులు, స్వాములు చెప్పిన మాట ప్రకారం భక్తులు ఆలయాలకు సోమవారం తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. భక్తులంతా ఆయా ఆలయాల్లో స్వామిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. వివరాలిలా ఉన్నాయి.

కలగంటి.. కలగంటి..!

- ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనం
- కిటకిట లాడిన ఆలయాలు
- భక్తులకు ప్రసాద వితరణ చేసిన ఆలయాల కమిటీ సభ్యులు



సీతానగరం: భక్తులకు నవనీతం అలంకరణలో వేణుగోపాలస్వామి దర్శనం



సీతానగరం: స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: ప్రత్యేక అలంకకణలో స్వామి వారు

మక్కువలో..

మక్కువ: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచి భక్తులు శంబర గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, మక్కువలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాలకు చేరుకుని, వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాసాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు.

సంగం వలస రామాలయంలో..

పార్వతీపురం: మండలంలోని సంగంవలస రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అలాగే పలు ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు.

వేణుగోపాలునికి నవనీత సేవ

సీతానగరం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక వేణుగోపాల స్వామివారికి అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు నవనీత సేవ చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి గోవింద నామస్మరణతో తిరువీధి చేశారు. అలాగే గోదాదేవి అమ్మవారికి భక్తులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన భక్తులతో పాటు గోవింద మాలధారులు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

రామాలయంలో ఉత్తరద్వార దర్శనం

బలిజిపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెంగాపురం గ్రామంలోని రామాలయంలో అర్చకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారి దర్శనానికి ఉత్తరద్వారం ఏర్పాటుచేసి భక్తులకు దర్శనం కల్పించారు. ముక్కోటి ఏకాదశి ఎంతో పర్వదినమని, ఆరోజున స్వామివారి ఉత్తరద్వార దర్శనం పవిత్రమైనదని అర్చకుడు గోపాలకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. తెల్లవారు జామునుంచి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కె.సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో ఉత్తరద్వార దర్శనంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

పార్వతీపురం టౌన్‌లో..

పార్వతీపురం టౌన్: పట్టణంలోని శ్రీ వేంటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి పూజలు అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు.



పార్వతీపురం టౌన్: క్యూలో బారులు తీరిన భక్తులు

కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేషాలంకరణ

సాలూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సాలూరు పట్టణంలోని పెద కోమటిపేట రామాలయం, వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం తదితర క్షేత్రాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేయగా స్వామివారు భక్తులకు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు.



సాలూరు: విశేష పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి

ఆర్‌ఓబీపై విద్యుత్ కాంతులు



వీధిలైట్లు వెలిగిస్తున్న సర్పంచ్ తేరేజమ్మ

సీతానగరం: రాష్ట్ర రహదారిపై సీతానగరం మండలం పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న అప్పయ్యపేట- సీతానగరం గ్రామాల మధ్య ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ కాంతులు ధగధగలాడుతున్నాయి. కొంతకాలంగా రోడ్డు కాంట్రాక్టర్ విద్యుత్ మెయింటనెన్స్ చేయక పోవడమో? ఎత్తైన స్తంభాలు ఏర్పాటు చేయడంతో సిబ్బంది పని చేయలేకపోవడమో కానీ లైట్లు పని చేయడం లేదు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన పెదభోగిలి మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆర్ఓబీపై లైట్లు వేయాలని తీర్మానం చేయడంతో సర్పంచ్ జె.తేరేజమ్మ, పాలకవర్గ సభ్యులు బ్రిడ్జిపై కొత్తలైట్లు పునరుద్ధరించి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బ్రిడ్జిపై రాత్రిపూట నిరంతరం విద్యుత్ దీపాలు వెలిగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటరావు, పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఆర్వీ పార్థసారథి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం చినభోగిలి సచివాలయంలో సర్పంచ్ కురమాన రాధ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికుటుంబానికి చేరేవిధంగా ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా సంక్షేమ పథకాలు మంజూరుచేసిందని చెప్పారు. అయితే ఇంకా సాంకేతికపరమైన లోపాలతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించడం, ఉపాధి బిల్లులు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందడం లేదని, రేషన్ కార్డులు విడదీయాలని అర్జీలు పెట్టినా సాంకేతికపరమైన సమస్యలను చూపి చేయడం లేదని, పింఛన్ పొందడానికి అన్ని అర్హతలూ ఉన్నా ఆదార్‌కార్డులో తప్పిదాల కారణంగా పింఛన్ మంజూరు కావడంలేదని ప్రజలనుంచి సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామసభల్లో తెలుసుకుని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి సమర్పించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామసభల్లో పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపాధి వేతనదారులకు పనులు కల్పించాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, శివుడయ్య

సీతానగరం: మండలంలో దివ్యాంగులైన ఉపాధి హామీ పథకం వేతన దారులకు పనులు కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ మేరకు సీఐటీయూ డివిజనల్ నాయకుడు జీవీరమణ మాట్లాడుతూ దివ్యాంగులందరూ ఉపాధి పనులు లేక ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివ్యాంగుల్లో అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఆర్.ఈశ్వరరావు, ఉపసర్పంచ్ అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు నేత్ర వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నగేష్ రెడ్డి

పార్వతీపురంటౌన్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కృష్ణపల్లి సచివాలయం పరిధిలో ఉన్న వృద్ధులకు నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60సంవత్సరాలు పైబడిన సుమారు 80మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని, అందులో ఐదుగురికి కళ్లజోళ్లు, నలుగురికి కాటరాక్ట్ శస్త్రచికిత్సల గురించి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ నేత్ర పరీక్షల్లో కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించామన్నారు. శస్త్రచికిత్సల కోసం పంపించిన వారికి మందులు, ఉచిత వసతిసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఎంతో మంది వృద్ధులు చూపు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

సీతంపేట: పెరటికోళ్ల పెంపకంతో మహిళా సంఘాలకు అదనపు ఆదాయం లభిస్తుందని వైకేపీ హెచ్‌డీ ఏపీఎం పార్వతి అన్నారు. సీతంపేటలో 48 పెరటికోళ్ల యూనిట్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీటిని పెంచడం వలన ఆర్థికపరంగా లబ్ధి పొందవచ్చన్నారు. సంఘాల సభ్యులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.

స్పందన వినతులు సత్వర పరిష్కారం



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య

పాలకొండ: స్పందనలో అందించిన వినతులను సత్వరం పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని, అర్జీదారులు ఫిర్యాదుల స్థితిగతులను ఎప్పుడుకావాలంటే అప్పుడు తెలుసుకోవచ్చన్నారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే అర్జీదారులకు సమాచారం ఇస్తామన్నారు. స్పందనలో పింఛన్లు అందించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు.

గిరిజన స్పందనకు 25 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి 25 వినతులు అందాయి. పీఓ బి.నవ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాతపట్నం మండలం కోణంగి గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

గులిమిసింగి గ్రామం నుంచి బిలుకలోవ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని శోబకు చెందిన సవర ఆనందరావు వినతిపత్రం అందజేశారు. పాంద్ర అక్కన్నగూడకు తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరారు. కుట్టుమిషన్ ఇప్పించాలని వజ్జాయిగూడకు చెందిన సవర సుశీల, కిరాణాషాపు పెట్టుకునేందుకు రుణం మంజూరు చేయాలని గుర్రాలమెట్టకు చెందిన గణేష్, స్కూల్‌లో వాచ్‌మెన్ పోస్టు ఇప్పించాలని కోరుతూ లోహరిజోలకు చెందిన విఘ్నేశ్వరరావు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మురళి, ఏపీడీ నారాయణరావు, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

రహదారి భద్రతపై అవగాహన

సీతంపేట: మండలంలోని పులిపుట్టి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై ఎస్సై ఎ.నీలకంఠరావు సోమవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. జీబ్రాక్రాసింగ్ గుర్తులు ఉన్నచోట మాత్రమే రోడ్డు దాటాలని, నిలిపి ఉంచిన కార్లు, వాహనాల వెనుక నుంచి పరుగెత్తుకుంటూ వెల్లకూడదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

108లో గిరిజన మహిళ ప్రసవం



108లో శిశువుకు జన్మనిచ్చిన మహిళ

సీతంపేట: మండలంలోని రేగుమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ బిడ్డిక శశి 108 అంబులెన్స్‌లో శిశువుకు జన్మనిచ్చింది. సోమవారం ఉదయం ఆమెను పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో రేగిడి మండలం నుంచి అంబులెన్స్ గ్రామానికి వచ్చింది. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలట్ జగన్నాథరావు, ఆశ వర్కర్ సరిత తల్లీబిడ్డకు ప్రాథమిక వైద్య సేవలు అందించి, అనంతరం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సూపరింటెండెంట్‌గా నాగభూషణరావు



నాగభూషణరావు

పాలకొండ రూరల్: పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ గొర్లె నాగభూషణరావు (జనరల్ సర్జన్) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ నాగశివజ్యోతి (ఎండీ గైనికాలజిస్టు) కూడా విజయనగరం నుంచి వచ్చి విధుల్లో చేరారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన జె.రవేంద్రకుమార్ చిన్నపిల్లల వైద్య సేవలు అందించనున్నారు.

కొత్తపింఛన్ల పంపిణీతో పండగ సందడి

- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



బలిజిపేట: చిలకలపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్



సీతానగరం: పెదభోగిలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ ఎస్ గౌరి



సాలూరు: పింఛన్లు అందిస్తున్న, మున్సిపల్ చైర్‌పర్సన్



సీతానగరం: అప్పయ్యపేటలో పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ మండల నాయకుడు సూర్యనారాయణ



పార్వతీపురం టౌన్: 29వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ యడ్ల త్రినాథ

సీతానగరం: ప్రభుత్వం మంజూరుచేసిన కొత్త పింఛన్లను సీతానగరం మండలంలోని గ్రామాల్లో వలంటీర్లద్వారా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా అన్నిగ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీల పర్యవేక్షణలో గ్రామాల్లో పింఛన్ల పంపిణీ రెండో రోజూ జరిగింది. ఈ మేరకు పెదభోగిలి-1,2 సెగ్మెంట్‌ల ఎంపీటీసీ సభ్యురాళ్లు ఎస్.గౌరి, బి.కుసుమ పింఛన్ పంపిణీ వారోత్సవాల్లో భాగంగా పెంచిన పింఛన్లతో పాటు కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను పెదభోగిలి, అప్పయ్యపేట గ్రామాల్లో పంపిణీ చేసి లబ్ధిదారుల్లో పండగ వాతావరణం నెలకొల్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాకేటి కూర్మారావు, ఐ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం

బలిజిపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదలకు అండగా ఉండే మనిషి అని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ తెలిపారు. పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు చిలకలపల్లిలో సోమవారం ఆయన అందజేశారు. ఇంతవరకు అందుకున్న మొత్తానికి అదనంగా రూ.250 పెంచి రూ.2,750 అందజేస్తున్నామని జెడ్పీటీసీ రవికుమార్ లబ్ధిదారులకు ఈ సందర్భంగా తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారని ఇది ప్రజలు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతి పనిచేస్తూ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 18,19 వార్డుల్లో పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల నుంచి పెంచిన రూ.250తో కలిపి రూ.2,750 పెన్షన్‌ను ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ, సువర్ణపాలన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పువ్వల ఈశ్వరమ్మ

పింఛన్ పెంపుపై లబ్ధిదారుల హర్షం

పార్వతీపురం టౌన్: పింఛన్ రూ.2,750 పెంపుపై లబ్ధిదారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 30 వార్డులో కౌన్సిలర్ త్రినాథ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటమేరకు పింఛన్‌లు పెంచడంతో లబ్ధిదారులు ఆనందంగా వలంటీర్లు, నాయకులను ఆహ్వానిస్తున్నారు.